



రీసర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష

'స్మార్ట్'గా బిగించేస్తున్నారు..!



- ఇప్పటికే 1.13 లక్షల మీటర్లు బిగింపు
- కొత్త మీటర్లతో పెరుగుతున్న విద్యుత్ బిల్లులు
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్మార్ట్ దోపిడీ మొదలైంది. విడతల వారీగా విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు. దీంతో పలువురికి గతంలో కంటే ఎక్కువ బిల్లులు వస్తున్నాయి. బిల్లులను చూసి వినియోగదారులు షాక్ అవుతున్నారు. ప్రస్తుతానికి స్మార్ట్ మీటర్లకు పోస్ట్ పెయిడ్ విధానంలో బిల్లులు వసూలు చేస్తుండగా భవిష్యత్తులో ప్రీ పెయిడ్ విధానాన్ని తీసుకురానున్నారు. సెల్‌ఫోన్ మాదిరి రీఛార్జ్ చేయకుంటే ఇంటికి విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. స్మార్ట్ మీటర్లు తమ పాలిట శాపంగా మారుతున్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 12.24 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ సర్వీసులన్నీ త్వరలో స్మార్ట్ మీటర్ల కిందకు రాబోతున్నాయి. స్మార్ట్ మీటర్లను అందించే వెసులు బాటును అదాని గ్రూప్ సంస్థకు ప్రభుత్వం ఇచ్చినట్లు తెలిసింది. విడతలవారీగా జిల్లాలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి విడతగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయగా రెండో విడతలో వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటివరకూ 1,13,225 స్మార్ట్ మీటర్లను బిగించారు. ఆ తరువాత మూడో విడతగా గృహాలకు ఈ స్మార్ట్ మీటర్లను పెట్టనున్నారు. ప్రస్తుతానికి స్మార్ట్ మీటర్లకు పోస్ట్‌పెయిడ్ విధానం లోనే బిల్లులు వసూలు చేస్తున్నారు. కర్నూలు 45వ వార్డులో అజీముద్దీన్‌నగర్ నివాసంలో ఉంటున్న వెల్డింగ్‌షాపు యజమాని జెఎండి ఉస్మాన్‌బాషాకు పాతమీటర్లు ఉన్నప్పుడు నెలకు రూ.3380 వచ్చేది. స్మార్ట్ మీటరు బిగించాక మొదటి బిల్లు రూ.30,758 వచ్చింది. కెపాసిటర్ వాడినందుకు వచ్చిందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇంతబిల్లు ఎలా కట్టాలి తగ్గించాలని వినియోగదారుడు ఉస్మాన్‌బాషా అధికారులను కోరితే తగ్గించే అవకాశం లేదని, చెల్లించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఇలా ఆయనతో పాటు పలువురికి స్మార్ట్ మీటర్లు పెట్టిన తరువాత విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో స్మార్ట్ మీటర్లకు ప్రీపెయిడ్ విధానాన్ని అమలు చేయనున్నారు. నిత్యం వాడే సెల్ ఫోన్ లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. రీఛార్జ్ చేసుకోకపోతే మరుసటిరోజే కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీఛార్జ్ చేసుకుంటేనే కరెంట్ వస్తుంది. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి.

మీటర్ రీడర్లకు దెబ్బ

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 2.50 లక్షల స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రభుత్వం టార్గెట్ ఇచ్చినట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల మీటర్ రీడర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడనుంది. స్మార్ట్ మీటర్ల వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 527 మంది మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోనున్నారు.

200 యూనిట్లపైన కాల్తే అందరికీ..

2019-20లోనే స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉన్నాయి. మోటర్లు, వాటర్ ప్లాంట్లు, వెల్డింగ్ షాపుల యజమానులు ఖచ్చితంగా కెపాసిటర్లను బిగించుకోవాలి. కెపాసిటర్లను వాడితే ఎంత ప్రయోజనమో, అంతే ప్రమాదం కూడా ఉంది. కెపాసిటర్లు పెట్టుకున్న వారు మోటర్లు ఆన్ చేసినప్పుడు ఆన్ అయ్యేటట్లు మోటరు ఆఫ్ చేస్తే ఆఫ్ అయ్యే విధంగా ఏర్పాటు చేసుకొని ఉంచాలి. లేనిపక్షంలో విపరీతమైన బిల్లులు వచ్చే ప్రమాదం ఉంది. 200 యూనిట్లపైగా కాల్తే వారందరికీ స్మార్ట్ మీటర్లు పెట్టాలని ఉంది. అంచెలంచెలుగా ప్రజల్లో అవగాహన కల్పించి స్మార్ట్ మీటర్లను పెంచాలని ప్రభుత్వము ఆలోచన.

– ఈ.విజయభాస్కర్, విద్యుత్ శాఖ డిఈ.

స్మార్ట్ మీటర్లు పెట్టకుండా అడ్డుకోండి

రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడం చాలా దుర్మార్గం. కర్నూలు జిల్లాలో కర్నూల్ నగరంలోని అజముద్దీన్ నగర్ లో ఉస్మాన్ అనే వినియోగదారునికి వచ్చిన బిల్లు చూస్తుంటే ప్రజలు రాబోయే కాలంలో కరెంటు వాడలేనే మళ్లీ బుడ్డి దీపాలకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. మూడు వేల రూపాయలకు వచ్చిన బిల్లు 30వేలు వచ్చిందంటే సామాన్య ప్రజలు ఎలా కట్టుకోవాలో చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలి. గతంలో బాదుడే బాదుడు అని చెప్పిన ఈ ముఖ్యమంత్రి ఇప్పుడు ఎందుకు స్మార్ట్ మీటర్లు తెచ్చి ప్రజలపైన భారం వేస్తున్నారు. ప్రజలు కూడా దీన్ని గమనించాలి. ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికలు దాటిన తర్వాత ప్రజలపై భారాలు మోసే మాట మాట్లాడుతున్నటువంటి ఇలాంటి రాజకీయ నాయకులను రీకాల్ చేసే పద్ధతి రావాలి. ప్రజలు మేలుకోకపోతే తర్వాత బాధపడతారు. అందుకోసం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి. స్మార్ట్ మీటర్లు పెట్టకుండా అడ్డుకోండి. బడా కంపెనీలు ఉడిమా చేయడం కోసమే ఈ ప్రభుత్వాలు ఉన్నాయి. సామాన్య ప్రజలకు వినియోగదారులకు మేలు చేసే ఒక్క కార్యక్రమం కూడా టిడిపి కూటమి ప్రభుత్వం చేయడం లేదు.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

- రీ సర్వే ప్రక్రియను పర్యవేక్షించిన కలెక్టర్

ప్రజాశక్తి-సి బెళగల్

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని కర్నూలు కలెక్టర్ పి.రంజిత్‌బాష సూచించారు. మండలంలో భూ రీ సర్వే ప్రక్రియ పై కలెక్టర్ గురువారం ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే దినోత్సవం సందర్భంగా సమగ్ర కొలతలు వేసి మండలంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సేవలు బాధ్యతాయుతంగా అందించాలని పేర్కొన్నారు. ఆర్‌డిఓ కిరారి సందీప్, డిఐఎ ఎస్.సుబ్బారెడ్డి, మండల అధికారులు తహసీల్దార్ పురుషోత్తం, ఎంపిడిఒ రాణెమ్మ, మండల సర్వేయర్ నాగభూషణం, రీ సర్వే తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి గోనె నాయక్, పిఆర్ఎఇ వెంకట ప్రకాష్, సర్పంచ్ పాండురంగన్న, వి ఆర్ ఓ లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో సీట్ల సంఖ్య పెంచండి

- కలెక్టర్‌కు సి బెళగల్ సర్పంచ్ వినతి

సి బెళగల్ కెజిబివి కి 30 అడుగులు రోడ్డు అభివృద్ధి చేసి మారుమూల మండల నిరుపేద బాలికలకు ప్రవేశాల్లో సీట్ల సంఖ్య పెంచాలని సర్పంచ్ పాండురంగన్న కోరారు. గురువారం సిబెళగల్ రీసర్వేకు వచ్చిన జిల్లా కలెక్టర్ తో సర్పంచి విన్నవించారు. కర్నూల్ - ఎమ్మిగనూరు రోడ్డు లో నుండి కెజిబివి రెండు వందల అడుగుల మేర రోడ్డు ఉండగా ఇరు ప్రక్కలను మురుగు కాల్వలు గుండా వచ్చే కంపు నివారణకు తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు.



తక్షణమే మెగా డిఎస్సి విడుదల చేయాలి

- డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

డివైఎఫ్ఐ కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బిర్లా కాంపౌండ్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ముందు గురువారం ధర్నా చేపట్టారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న నాయకత్వాన, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ అధ్యక్షత వహించారు. మెగా డిఎస్‌సి విడుదల చేయాలని, డివైఎఫ్ఐ జిందాబాద్ అంటూ, కలెక్టర్ బయటికి రావాలని ఎర్రటి ఎండలో సైతం నినాదాలు చేశారు. కలెక్టర్ బయటికి రాకపోవడం తో నిరుద్యోగులంతా ఒక్కసారిగా గేట్లు తోసు కుంటూ లోపలికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడో పట్టణ సిఐ కలగజేసుకొని డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ నాగలక్ష్మిని బయటికి పిలిచి వినతి పత్రం అందించారు.

(పూర్తి వివరాలు మెయిన్ పేజీలో)

జిజిహెచ్ కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్, స్వీపర్లు, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు నగర ఉపాధ్యక్షులు మహిమూద్ అధ్యక్షతన విజయ రామాంజనేయులు, నాయకులు కుమార్ కలిసి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలను సూపరింటెండెంట్‌కు వివరించారు. కార్మికులకు నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉండటంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని, వారు పస్తులతో పనిచేస్తున్నారని తెలిపారు. ఏ 1 ఫ్యాకల్టీ ఏజెన్సీ స్వీపర్లకు 4 నెలల జీతాలు, ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ సెక్యూరిటీ గార్డ్స్‌కు 3 నెలల జీతాలు, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు రెండు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయనిపేర్కొన్నారు. ఈ ఏజెన్సీలలో కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదని, ఇఎస్ఐ, పిఎఫ్ తక్కువగా జమ చేస్తూ కార్మిక చట్టాలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించనందుకే ప్రజలు ఓడించి ఇంటికి పంపించారని అన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేస్తామని చెప్పి, ఇప్పుడు కార్మిక హక్కులు, చట్టాలను కాలరాసి కార్మిక కోడ్‌లను అమలు చేయాలని చూస్తోందన్నారు. తద్వారా కార్మికులను బానిసత్వంలోకి నెట్టాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఏ 1, ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీలు వచ్చినప్పటి నుండి జీతాలు, హక్కులు అడిగిన కార్మికులను అక్రమంగా డ్యూటీ నుండి తొలగిస్తూ వారి కడుపు కొట్టారని తెలిపారు. కార్మికులు తమ కష్టాలను జిల్లా కలెక్టర్‌కు, హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు, డిసిఎల్‌కు, ప్రభుత్వ పెద్దలకు ఎన్నిసార్లు విన్నవించినా ఏజెన్సీలకే వత్తాసు పలుకుతూ కార్మికుల కన్నీటికి కారణమయ్యారని విమర్శించారు. నిజంగా ఈ ప్రభుత్వానికి, ప్రభుత్వ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ స్వీపర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కార్మికులకు తక్షణమే పెండింగ్ జీతాలు ఇప్పించి, అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ అగ్రిమెంట్ కాలం పూర్తయినందున కార్మికులకు పెండింగ్ జీతాలు, ఇతర అలవెన్సులు పూర్తిగా చెల్లించిన తర్వాతనే క్లియరెన్స్ సర్టిఫికేట్ ఇవ్వాలన్నారు. లేని పక్షంలో సిఐటియు కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సిఐటియు నగర నాయకులు కుమార్, శీను, నగేష్, మరియు కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

12,13న రాయలసీమ ప్రాంతీయ వర్క్‌షాపు

- ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 12, 13 తేదీల్లో జరిగే రాయలసీమ జిల్లాల ప్రాంతీయ వర్క్ షాపును అన్ని వర్గాల కార్మికులు ఉద్యోగులు జయప్రదం చేయాలని ఆటో యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ కార్మికులను కోరారు. గురువారం కార్మిక కర్షక భవన్‌లో సుందరయ్య స్టాండ్ ఆటో కార్మికుల సమావేశం ఆటో యూనియన్ అధ్యక్షులు వలి అధ్యక్షతన నిర్వహించారు. కె.ప్రభాకర్ మాట్లాడుతూ కోట్లాదిగా ఉన్న అసంఘటితరంగా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ఆశ, అంగన్వాడి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు సంఘాల్లో రాజకీయ జోక్యాలు అధికమయ్యాయని వారన్నారు. బ్రిటిష్ కాలం నాటి లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు ప్రమాదకర లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికులను కట్టు బానిసలుగా ఈ ప్రభుత్వాలు చేస్తున్నాయని అన్నారు. అసంఘటితరంగ కార్మికులు ఆటో భవన, హమాలీ కార్మికులకు సంక్షేమ చట్టాలు అమలు చేయడం లేదన్నారు. వీటన్నిటిపై రాష్ట్ర వర్క్ షాప్‌లో చర్చించి ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వపై పోరాటం నిర్వహిస్తామని చెప్తారు. కర్నూలులో నిర్వహించే సిఐటియు రాష్ట్ర సమావేశాలు జయప్రదం చేయడానికి కార్మికులందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆటో యూనియన్ నగర నాయకులు నబీ, సుందరయ్య ఆటో స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు పెద్ద కరుణ, చిన్న కరుణ, శ్రీనివాసులు ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ కబర్ధి

హోమియో వైద్యం ఉత్తమమైనది

ఉచిత హోమియో మందులు పంపిణీ చేసిన జస్టిస్ కబర్ధి

కర్నూలు- ప్రజాశక్తి లీగల్

కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ , దయాల్‌బాగ్ రాధాస్వామి సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ హోమియో దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని న్యాయ సేవ సదన్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లాప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, ఇతర న్యాయాధికారులు హాజరయ్యారు. జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ హోమియో వైద్యం ఉత్తమమైనదిగా అభివర్ణించారు. ఈరోజు ప్రపంచ హోమియో దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత హోమియో శిబిరాన్ని నిర్వహించిన డాక్టర్ భాస్కర్‌రెడ్డిని అభినందించారు. ఎండ కాలంలో వడదెబ్బ తగలకుండా ఉండేందుకు హోమియో మందులను కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ న్యాయమూర్తి చేతుల మీదుగా అందజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ వైద్యాలన్నింటిలోకెల్లా హోమియో వైద్యం చాలా ఉత్తమమైనదని, చిన్నపాటి మందుతోనే తీవ్రమైన వ్యాధులను సైతం నయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన దయల్‌బాగ్ హోమియో కమిటీ వారిని అభినందించారు. హోమియో వైద్యులు డాక్టర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులను సైతం హోమియోలో చిన్నపాటి మందుతోనే నయం చేయ వచ్చన్నారు. నూరు శాతం సైడ్ ఎఫెక్ట్లు లేని మందు హోమియో మాత్రమేనని అన్నారు. ఈ హోమియో వైద్యాన్ని మొదటిగా జర్మనీకి చెందిన వైద్యుడు ఫెడరిక్ క్రిస్టియన్ శామ్యూల్ హనేమాన్ కనుగొన్నారని, ఆయన జన్మదినాన్ని ప్రపంచ హోమియో పతి దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.ఈ అవకాశాన్ని ఇచ్చిన న్యాయమూర్తులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు కోర్టులకు సంబంధించిన న్యాయమూర్తులు, కర్నూలు బార్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి, ఎన్‌జిఒ గంగాధర్ రెడ్డి న్యాయవాదులు , కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు ఎంపిపి వాసు వేంకటేశ్వరమ్మ భర్త ధర్మ వరం వాసు గురువారం విజయవాడలో మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసి తన కుమారుడు వివాహానికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కోడుమూరు వైసిపి ఇన్చార్జి ఆదిమూలం సతీష్ తో కలిసి ఇచ్చారు. ఈ నెల 20న తన కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను అక్షితలతో ఆశీర్వదించాలని కోరారు.



ప్రతి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్త

మెప్మా పిడి నాగశివలీల

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రతి కుటుంబం నుండి ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివ లీల అన్నారు. గురువారం న్యూ కౌన్సిల్ హాలులో 2025-26 సంవత్సరానికి మెప్మా కార్యక్రమాలు పై కర్నూల్ , గూడూరు కు సంబంధించిన రిసోర్స్ పర్సన్‌లకు మెప్మా ప్రాజెక్టు డైరెక్టరంధాధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒక సారి మనకు ఇచ్చిన టార్గెట్లు తప్పక పూర్తి చేయాలని, గ్రూప్ సభ్యులతో మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. నూతన జీవనోపాధి యూనిట్ల ఏర్పాటులో భాగంగా వారికి ఏ లోన్స్ ఇప్పిస్తున్నాం, ఆ అమౌంట్ తో వారు ఏ యూనిట్ పెట్టిస్తున్నారు. అనేది క్లియర్ గా ఉండాలని అన్నారు. ఏప్రిల్ నుంచి బ్యాంక్ లోన్స్ అన్ని కూడా ఆన్‌లైన్‌లో అర్‌పిలాగిన్ లో రిక్వెస్ట్ చేయాలని, వాటిని సిఒ, సిఎంఎం, పిడి లాగిన్ లో అప్రూవల్ ఇస్తే సంబంధిత బ్యాంక్‌కు వెళ తుందన్నారు. ఆ తర్వాత బ్యాంక్ వారు లాగిన్ లో చెక్ చేసుకొని లోన్ సాంక్షన్ చేస్తారని తెలిపారు. ఈ విధంగా చేయడం వలన డూప్లికేషన్ పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ఈ శ్రమ్ కు సంబంధించి అందరూ అర్‌పిలకు లాగిన్‌లు ఇస్తున్నామని, మన గ్రూప్స్‌లో ఉండే అందరూ సభ్యులు , వారి కుటుంబ సభ్యులను రిజిస్టర్ చేయించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ కు సంబంధించి ప్రతి అర్‌పి మీ పరిధిలో ఉన్న అందరూ సభ్యులతో ఫీడ్ బ్యాక్ అప్డేట్ చేయించాలన్నారు. టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటలక్ష్మి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి , టిఇలు, టిఎంసిలు సుధాకర్, భారతి, వీరారెడ్డి, సిఒలు, అర్ పి లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల

గాలి వాన..!

ప్రజాశక్తి ప్రతినిధి - కర్నూలు

కర్నూలు నగరంలో గురువారం రాత్రి ఒక్కసారిగా జోరు వాన కురిసింది. సాయంత్రం వరకు ఎండ వేడిమి భగభగలతో కనిపించిన వాతావరణం రాత్రి 8 గంటలకు చల్లబడింది. గాలితో మొదలై వర్షం కురిసింది. తరువాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఎండవేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. అదే సమయంలో వేడెక్కిన నేలపై వర్షం పడటంతో ఉక్కపోత మొదలైంది. వర్షంతో కర్నూలు నగరంలోని ప్రధాన రహదారుల్లో వర్షపునీరు పారాయి. పలు ప్రాంతాల్లో కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు వీధుల్లోకి చేరాయి. నగరంలోని రాజ్ విహార్, బళ్లారి చౌరస్తా, కృష్ణ నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, సి క్యాంప్, నంద్యాల చెక్ పోస్ట్ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై వర్షపునీరు నిల్వ ఉన్నాయి.



అందం పేరుతో నదుల విధ్వంసం...

-నదులు కబ్జాకు గురయితే పట్టని అధికారులు
-ఆక్రమణలు కాకుండా కాపాడేందుకు పార్కులా?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అందం పేరుతో పార్కులను నిర్మిస్తామంటున్న మున్సిపల్ అధికారులు ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి నిర్మించడం సరికాదు. నగరంలో పార్కు స్థలాలు చాలా అన్యాక్రాంతం అవుతున్నాయి. వాటిని అన్యాక్రాంతం కాకుండా రక్షించే దిశగా పార్కులను అభివృద్ధి చేయాలి. నదీపరివాహకాన్ని విధ్వంసం చేసి నదులు అన్యాక్రాంతం కాకుండా ఉంచేందుకు పార్కులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పడం శోచనీయం.

కర్నూలు ఆనంద్ థియేటర్ ఎదురుగా, కెఇ మాదన్న నగర్ పక్కన హంద్రీ నదిని ఆక్రమించుకొని నిర్మిస్తున్న పార్కును చూసి నిర్వహణ లోపిస్తే అసాంఘిక కార్యక్రమాలు జరగక తప్పవు. పేదలు హంద్రీ ఒడ్డున గుడిసెలు వేసుకుని ఆ తర్వాత శాశ్వత గృహాలు నిర్మించుకున్న హబీబ్ ముబారక్ నగర్ హంద్రీకి వరద వస్తే ముంపుకు గురై రాత్రికి రాత్రి సర్వం వదులుకొని వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. నదులను ఆక్రమిస్తే నదిలో నీరు ప్రజలను ముంచేస్తుంది. గతంలో రాజకీయ నాయకుల అండదండలతో హంద్రీనది ఒడ్డున రాజకీయ నాయకులు పెద్దపెద్ద భవంతులు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. పేదలు ఉండడానికి ఇల్లు లేక చిన్న గుడిసె వేస్తే పట్టణ ప్రణాళిక విభాగం వారు వారిని భయపెట్టి తొలగిస్తున్నారు. అదే రాజకీయ నాయకుల జోలికి వెళ్లరు. పేదలు చేస్తే తప్పు పెద్దలు చేస్తే ఒప్పు అన్న విధంగా అధికారులు వ్యవహరించడం సరికాదు. అవసరమైతే నదికి ఇరువైపులా ఆక్రమణలకు గురి అయిన భవనాలన్నింటినీ కూల్చి హైదరాబాద్ ట్యాంక్ బండ్‌లాగా ఇరువైపులా కరకట్టలు ఏర్పాటు చేసి మొక్కలు నాటి నడకకు కావలసిన వాకింగ్ ట్రాక్ సుందరంగా తీర్చిదిద్దితే ఉదయం సాయంత్రం పిల్లలు, పెద్దలు, వయోవృద్ధులు అందరూ నడకను సాగిస్తూ పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ మంచి ఆక్సిజన్‌ను పీల్చుకొని ఆరోగ్యంగా ఉండవచ్చు. అలా కాకుండా హంద్రీలో నగరంలోని చెత్తంతా వేస్తూ మురుగునీరు వదులుతూ దుర్వాసన వెదజల్లే విధంగా ఉండే ప్రాంతంలో ప్రజలు నడక సాగిస్తే ఆరోగ్యం రాకపోగా అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. వీలైతే తుంగభద్ర, హంద్రీ నదులలో నగరంలోని మురుగు నీరు కలవకుండా ఆ నీటిని శుద్ధి చేసి డివైడర్ల మధ్యన గల మొక్కలకు, పార్కులలోని మొక్కలకు ఉపయోగిస్తే అందం, ఆహ్లాదం లభిస్తుంది.

ఆక్రమణలకు గురికాకుండానే పార్కు నిర్మాణం
-నగరపాలక సంస్థ ఎస్ ఇ రాజశేఖర్



హంద్రీనది అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు, సుందరీకరణకు ఆనంద్ టాకీస్ ఎదురుగా హంద్రీ నది ఒడ్డున పార్కును నిర్మిస్తున్నాం. దీనిని ప్రజలు ఇతర నాయకులు అర్థం చేసుకోవాలి. ఎవరికీ ఆ స్థలాన్ని ధారాదత్తం చేయబోమని తెలిపారు.



ఆనంద్ థియేటర్ ఎదురుగా హంద్రీనది వేగాన్ని అడ్డుకునే తరహాలో నిర్మిస్తున్న పార్కు

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి
-సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి. ఆనంద్ బాబు



వంకలు, కాలువలు మురుగు కూపాలుగా మారకుండా వాటిని శుభ్రపరిచి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలి. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి, హంద్రీ నదిని ఆక్రమించి మరీ కోట్లు ఖర్చుపెట్టి పార్కును నిర్మించాల్సిన అవసరం ఏమీ లేదు. ఎక్కడపడితే అక్కడ వాగులు, వంకలు, నదులు కబ్జాలకు గురై అవి పొంగి పొర్లినప్పుడు ప్రజల ఆస్తి, ప్రాణ నష్టానికి దారితీస్తున్నాయి. నదుల ప్రమాదం నుండి ప్రజలను రక్షించడం కోసం కరకట్టలను నిర్మించమంటే.. ఎక్కడికక్కడ ఉన్న నదులను పూడుస్తూ ప్రమాదానికి నిలయాలుగా మారుస్తున్నారన్నారు. నదిని పూడ్చి పార్కు నిర్మించడానికి జలవనరుల శాఖ ఎలా అనుమతినిచ్చిందో తేల్చాలి. పాలకులు, అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్ల కడుపు నింపడానికే ఇలాంటి పనులు చేస్తున్నారన్నారు. నదుల పక్కన కట్టే కరకట్టలు సైతం డంపుతో పూడుస్తున్నారని అవి భవిష్యత్తులో ఎలా నిలబడతాయని ప్రశ్నించారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు



డాక్టర్ మాధవి లతకు సూచనలు ఇస్తున్న వైద్య బృందం

ప్రజాశక్తి - ఆదోని

ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల బృందం సూచించింది. గురువారం పట్టణంలోని స్త్రీలు, చిన్నపిల్లల ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ (అదనపు డైరెక్టర్), నాగేంద్ర (యూనిసెఫ్ కన్సల్టెంట్), ముర్తుజావలీ (జిల్లా నాణ్యత అధికారి), చంద్రశేఖర్ (డిప్యూటీ డెమో) మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాలపై ఎప్పటికప్పుడు అంచనాలు వేసి రోగాలు దరి చేరకుండా జాగ్రత్తలు వివరించమే కాయ కల్ప ప్రోగ్రాం ఉద్దేశమని తెలిపారు. ఇన్‌ఫెక్షన్ నియంత్రణ పద్ధతులు, పరిసరాల పరిశుభ్రత, గృహ నిర్వాహక సేవలు, చిన్నారుల భద్రత, రోగులు వాడిన బట్టల లాండ్రీ సేవలను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. ఇక్కడ లోటుపాట్లు, కావాల్సిన వసతుల గురించి రాష్ట్ర కార్యాలయానికి నివేదిక పంపుతామని తెలిపారు. దీని ఆధారంగా కాయకల్ప ప్రోగ్రాం అమలు జరుగుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సౌజన్యంతో కాయకల్ప ప్రోగ్రాం నిర్వహణ కొనసాగుతుందన్నారు.

పోరాటాలతోనే ప్రజల్లోకి వెళ్దాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-దేవనకొండ

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృత పోరాటాలు నిర్వహించినప్పుడే పార్టీ బలోపేతం కావడానికి అవకాశం ఉందని, ప్రజా పోరాటాల్లో పార్టీ సభ్యులు ముందుండాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పేర్కొన్నారు. గురువారం సిపిఎంలో నూతనంగా పార్టీ సభ్యులుగా చేరిన నాలుగు గ్రామాలకు సంబంధించిన 24 మందికి పార్టీ నిర్మాణం, పోరాటాల నేపథ్యం, పని పద్ధతులపై గౌస్ దేశాయ్ వివరించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు అశోక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వీరశేఖర్ మాట్లాడారు. మండలంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రధానంగా సాగునీటికి అన్ని అవకాశాలున్నా పాలకుల నిర్లక్ష్యం వల్ల సాగు నీరు అందడం లేదని తెలిపారు. రోడ్లు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు, ప్రభుత్వాలు విధిస్తున్న భారాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని కోరారు. ప్రజా పోరాటాలే పార్టీకి పునాది అని, ఆ విధమైన కార్యాచరణ అందరూ అలవర్చుకోవాలని తెలిపారు. పార్టీ సిద్ధాంతానికి అనుగుణంగా ప్రజల మన్ననలు పొందాలని, మండలంలో తిరుగులేని శక్తిగా సిపిఎంను నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు యూసుఫ్ బాష, మహబూబ్ బాషా, సీనియర్ నాయకులు బజారి, మహేంద్ర, ఆయా గ్రామాల నాయకులు శ్రీనివాసులు, సుధాకర్, రవీంద్ర, బలరాముడు, లతీఫ్, దొడ్డప్ప, లోకయ్య, బడేసాబ్, సూర్యచంద్ర, వీరప్ప, నాగరాజు పాల్గొన్నారు.

అంగన్వాడీ సేవలను వినియోగంచుకోవాలి

- సిడిపిఒ ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిడిపిఒ ఉమా మహేశ్వరి తెలిపారు. గురువారం పట్టణంలోని అరులయ వీధి, దివాకర్ రెడ్డి నగర్, కల్లుబావి ప్రాంతాల్లో పోషక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లబ్ధిదారులకు 1000 రోజుల సంరక్షణలో భాగంగా గర్భిణులు మొదటి రోజు నుంచి రెండేళ్ల వరకు పుట్టిన బిడ్డకు తీసుకోవాల్సిన ఆహారం, టీకాలు, ఆరు నెలలు నిండిన తర్వాత అనుబంధ పోషకాహారం అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో లభించే పౌష్టికాహారాన్ని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సావిత్రి, అంగన్వాడీలు ఈరమ్మ, సరోజ, ముత్తమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

ఏరూరు రహదారి ఇబ్బందులు..!

- రహదారిలో ప్రయాణం.. ప్రమాదాలకు నిలయం...
- అడుగడుగునా కంకర తేలిన గుంతలే - ఆటోలోనే ఇద్దరు మహిళల ప్రసవం
- భయపడుతున్న కూలీలు, విద్యార్థులు - మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్

ప్రజాశక్తి - చిప్పగిరి

ఈ రహదారిలో ప్రయాణం ఇబ్బందితో కూడుకున్నది. రహదారి కంకర తేలి గుంతలు పడింది. గుంతలో రహదారిలో ప్రయాణిస్తూ గతంలో ఇద్దరు మహిళలు ఆటోలోనే ప్రసవించారు. ఈ రహదారిలో ప్రయాణించాలంటే మిరప కూలీలు, విద్యార్థులు భయపడుతున్నారు.

రహదారుల మరమ్మతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్ల నిధులను వెచ్చిస్తున్నాయి. మారుమూల ప్రాంతాలకు వెళ్లే రహదారులన్నీ చాలా అధ్వానంగా మారి ప్రయాణించాలంటే కూడా భయపడే పరిస్థితి దాపురించింది. సంక్రాంతి పండగలోపు ఏ రోడ్డు కూడా గుంతలు లేకుండా చూసుకుంటామని కూటమి ప్రభుత్వం పదేపదే చెప్పింది. ఏరూరు రహదారికి మాత్రం మోక్షం రాలేదని ఏరూరు, దేగులపాడు, మల్లికార్జున పల్లి, కమ్మరచేడు గ్రామాల ప్రజల ఆవేదన చెందుతున్నారు. పంచాయతీరాజ్ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదని, రహదారి ఇంత అధ్వానంగా ఉన్నా ప్రభుత్వానికి నివేదికలు ఇస్తున్నారా లేదా అని అనుమానం కలుగుతుందని ప్రజలు వాపోతున్నారు. చిప్పగిరి నుంచి దేగులపాడు వరకు దాదాపు 16 కిలోమీటర్లు ప్రయాణించాలంటే ప్రమాదాలను కొని తెచ్చుకోవడమేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల వ్యవధిలో దేగులపాడు నుంచి ఆటోలో తీసుకొస్తున్న గర్భిణీ మహిళ ఏరూరు గ్రామం దగ్గరకు వచ్చే సరికి ఆటో కుదుపులకు అక్కడే ప్రసవించిందని దేగులపాడు ఆటోడ్రైవర్ ఆంజనేయులు తెలిపారు. ఇలాంటి సంఘటనే నెలలోపు రెండుసార్లు జరిగిందని చెప్పారు. ద్విచక్ర వాహనంలో వెళితే కంకర తేలిన గుంతలను తప్పించడానికి ఎన్ని ఇబ్బందులు పడినా కడుపునొప్పి వచ్చేలా ఉంటుందని పలు వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఒక సమయంలో ఇద్దరు అధికారులు స్కూటీ అదుపు తప్పి కింద పడిన సందర్భాలు ఉన్నాయి. వారు బయటకు చెప్పుకోలేక పోయారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మిరప పొలాల్లో పనులు చేసుకోవడానికి నిత్యం పలు గ్రామాల నుంచి ఆటోల్లో వస్తున్న కూలీల పరిస్థితి ఎంత ఇబ్బందిగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కూలీలు వెళ్లే ఆటోలు ప్రమాదాలకు గురై కూలీలు మృతి చెందిన సంఘటనలు ఎన్నో చూస్తున్నాం. ఆర్అండ్‌బి అధికారులకు అవి కనపడవని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని, రహదారి వెంట ఒకసారి అధికారులు కూడా వారి కళ్లతో చూస్తే అర్థమవుతుందని ప్రజలు తెలుపుతున్నారు. పూర్వకాలం నుంచి కూడా చిప్పగిరి నుంచి ఏరూరు, దేగులపాడు, కమ్మరచేడు గ్రామాల మీదుగా బళ్లారికి తక్కువ సమయంలో చేరుకోవడానికి వెసలుబాటు ఉండేది. తమ ఆవేదనను అర్థం చేసుకొని స్థానిక ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం, టిడిపి ఇన్‌ఛార్జీ చొరవ తీసుకొని మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించి నిధులు మంజూరు చేయించాలని ఏరూరు, దేగులపాడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





కంకర తేలి గుంతల పడి ఉన్న ఏరూరు రహదారి

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

- బీసీ సంఘం రాష్ట్ర సంక్షేమ కార్యదర్శి ఏరూరు రంగస్వామి



చిప్పగిరి నుంచి ఏరూరు, దేగులపాడు రహదారి అధ్వానంగా ఉంది. రోజూ కూలీలు, విద్యార్థులు, ప్రజలు చిప్పగిరికి, గుంతకల్లు పట్టణానికి ఏదో ఒక పని మీద తిరుగుతుంటారు. ప్రతి ఒక్కరూ ఆర్అండ్‌బి అధికారులను, ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ శాపనార్థాలు పెడుతున్నారు. ఆ ఇబ్బందులను అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. పంచాయతీ రాజ్ ప్రాజెక్టు అధికారులు రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

శ్రీమఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. గురువారం స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి, బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో పల్లకోత్సవం నిర్వహించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు భక్తులకు ఫల మంత్రాక్షితలు అందజేసి ఆశీర్వదించారు.

ఘనంగా జాతీయ సర్వే దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని



కేక్ తినిపిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాతీయ సర్వే దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా జరిగాయి. ఒకరికొకరు కేక్ తినిపించుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ముఖ్య అతిథిగా హాజరై, సర్వే శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సేవలను ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ... సర్వే శాఖ ఉద్యోగులు చేపడుతున్న సేవలు అమూల్యమైనవని, వారి కృషితో భూసర్వే విధానాలు, భూసాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సర్వేయర్లకు శుభాకాంక్షలు తెలిపారు. తహశీల్దార్ శివరాముడు, డిప్యూటీ తహశీల్దార్లు గుండాల నాయక్, పెద్దయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ వేణు సూర్య, మండల సర్వేయర్ ఈశ్వర్ ఉన్నారు. **నందవరం** తహశీల్దార్ కార్యాలయంలో జాతీయ సర్వే దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడారు. ఆర్ఐ సుబ్బారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శశి శేఖర్, విఆర్ఒ రామేశ్వరమ్మ పాల్గొన్నారు.



నందవరంలో

వైసిపి కౌన్సిలర్ల డుమ్మా..!

- మరోసారి కౌన్సిల్ వాయిదా

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార వేదికగా నిలవాల్సిన కౌన్సిల్ అభాసు పాలవుతోంది. మున్సిపల్ ఛైర్మన్ శాంత వర్సెస్ వైసిపి కౌన్సిలర్లు అన్న రీతిలో ఆదోని మున్సిపాలిటీలో నిర్వాకం కొనసాగుతోంది. ఛైర్మన్ శాంత వ్యవహారం నచ్చక కౌన్సిల్ సమావేశాన్ని గత నెల 30న మెజార్టీ వైసిపి కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. అప్పట్లోనే అజెండాలోని చాలా అంశాలు తీర్మానం నోచుకోక పెండింగ్‌లో ఉన్నాయి.

డుమ్మా కొట్టిన కౌన్సిలర్లు : మున్సిపల్ ఛైర్మన్ శాంత అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణ కౌన్సిలర్లందరికీ అజెండా పంపారు. సమావేశం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. 11.40 గంటలైనా మెజార్టీ వైసిపి కౌన్సిలర్లు ఎవరూ రాకపోవడంతో కోరం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. వైసిపి నుంచి బిజెపిలో చేరిన కౌన్సిలర్లు సురేష్, వసీం, చిన్న, టిడిపి కౌన్సిలర్ పార్వతి మాత్రమే హాజరయ్యారు. కౌన్సిలర్లు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ శాంత ప్రకటించారు. కౌన్సిల్ హాలులో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్, రెవెన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, నాగరాజు, చంద్రమోహన్ ఉన్నారు.

పదవి నుంచి దించాలనే : ఛైర్మన్ పదవి నుంచి తనను దించాలన్న దురుద్దేశంతోనే వైసిపి మెజార్టీ కౌన్సిలర్లు కౌన్సిల్‌కు డుమ్మా కొట్టారని ఛైర్మన్ శాంత ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఛాంబర్‌లో మాట్లాడారు. నాలుగేళ్లుగా ఎంతో నిజాయితీగా ఛైర్మన్‌గా కొనసాగుతున్నామని, తనను పదవి నుంచి దించి ఛైర్మన్‌గా సిహెచ్.లోకేశ్వరిని చేయాలని వైసిపి కౌన్సిలర్లు పావులు కదుపుతున్నారని తెలిపారు. తనపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు గతనెల 18న కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారన్నారు. దీన్ని నిరసిస్తూ గత నెల 20 నుంచి నిరసన దీక్ష చేపట్టి వైసిపి కౌన్సిలర్ల అవినీతి బాగోతాన్ని ప్రజలకు వివరించామని తెలిపారు. తనకు జరుగుతున్న అవమానం, అన్యాయంపై వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి లేఖ రాశామని చెప్పారు. అవిశ్వాస తీర్మానం జరిగేలోపు అధిష్టానం నుంచి తనకు అనుకూలంగా నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 16న అవిశ్వాస తీర్మానం కోసం బలపరీక్ష జరుగుతుందని, ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. డబ్బు లేని కారణంగానే పదవి నుంచి దించాలని కుట్ర జరుగుతోందన్నారు. ప్రజా సమస్యలు చర్చించాల్సిన కౌన్సిల్‌ను అపహాస్యం చేయడం వైసిపి కౌన్సిలర్లకు తగదన్నారు. తాగునీటి సమస్య, మార్కెట్ వేలం, పశువుల సంత, జీవాల మార్కెట్ అంశాలు అజెండాలో పొందుపరిచామన్నారు. సభ్యుల తీర్మానం అనంతరం కార్యకలాపాలు కొనసాగాల్సి ఉండగా వాయిదా వల్ల పెండింగ్ పడ్డాయని చెప్పారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న వైసిపి కౌన్సిలర్లు పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



మాట్లాడుతున్న చైర్మన్ శాంత



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న కౌన్సిల్ హాలు

'మోడల్' ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

ప్రజాశక్తి-ఆలూరు

ఎపి మోడల్ స్కూల్ 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించే పరీక్ష తేదీని మార్పు చేసినట్లు ప్రిన్సిపల్ ఆర్.రాఘవరావు గురువారం తెలిపారు. రాష్ట్రంలోని 164 మోడల్ స్కూళ్లు (ఆదర్శ పాఠశాల)లో 2025-26 విద్యా సంవత్సరం 6వ తరగతిలో చేరేందుకు ఈనెల 20న (ఆదివారం) రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు నిర్ణయించారని తెలిపారు. ఈస్టర్ పర్వదినం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలతో 21న (సోమవారం) పరీక్ష నిర్వహించేందుకు తేదీని మార్చినట్లు చెప్పారు. ప్రవేశ పరీక్ష తేదీ మార్పును గమనించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని కోరారు. విద్యార్థులు హాల్ టికెట్లను www.cse.ap.gov.in or www.apms.apcfss.in వెబ్ సైట్స్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరని తెలిపారు.

సుచి, శుభ్రత పాటించాలి

- హెల్త్ ఆఫీసర్ సందీప్

ప్రజాశక్తి - ఆదోని




తినుబండారాలు తయారు చేసేవారు సుచి, శుభ్రత పాటించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ సూచించారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. హోటల్, రెస్టారెంట్, ఆరుబయట తినుబండారాలు విక్రయించేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. ఈగలు, దోమలు వాలకుండా పదార్థాలపై మూత తప్పనిసరిగా కప్పి ఉంచాలని సూచించారు. వినియోగదారులు తిన్న తర్వాత పాత్రలను వేడి నీళ్లలోనే శుభ్రం చేయాలన్నారు. టీ గ్లాసులు వేడి నీళ్లలో కడిగి ప్రతి హోటల్‌లో ఫిల్టర్ వాటర్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. టీ తాగినా, టిఫిన్ చేసినా, గ్లాసులు, ప్లేట్లను మురుగు కాలువల్లో వేయడం వల్ల చెత్త పేరుకుపోయి నీరు నిలిచి రోడ్లపై ప్రవహించి పరిసరాలను అపరిశుభ్రం చేస్తాయన్నారు. తినుబండారాల్లో నాసిరకం పదార్థాలు కల్తీ ఉన్నట్లు నిర్ధారణ అయితే కేసు నమోదు చేసి భారీ మొత్తంలో జరిమానా విధిస్తామని హెచ్చరించారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. త్వరలోనే తనిఖీలు చేపడతామని తెలిపారు.

జాతీయ క్రీడాకారిణికి నాయకుల చేయూత

ప్రజాశక్తి - మంత్రాలయం

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడలకు ఎంపికైన ముస్కాన్‌కు నాయకులు రూ.15 వేల ఆర్థిక సహాయం అందించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు బసవరాజు, నరసింహరాజు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని కొల్హాపూర్‌లో ఈనెల 22 నుంచి 31 వరకు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముస్కాన్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో క్రీడాకారిణి ముస్కాన్ తండ్రి ఆటోడ్రైవర్ షేక్ అహ్మద్‌కు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డికి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డికి, చేరవేశామని చెప్పారు. స్పందించిన వారు ఎమ్మిగనూరు భీమా నిలయంలో ప్రదీప్ రెడ్డి రూ.10 వేలు, మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో రాఘవేంద్ర రెడ్డి రూ.5 వేలు అందజేశారని తెలిపారు. గత జనవరిలో సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కర్నూలు జిల్లా తరఫున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఎస్‌జిఎఫ్‌ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో జరిగే జాతీయస్థాయి అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.





ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఘనంగా సీతారామిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

వైసిపి నాయకులు, టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు, ఎమ్మిగనూరు ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వై.సీతారామిరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో వైసిపి మండల ఇన్‌ఛార్జీ సివి.విశ్వనాథ్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అంతకుముందు రాఘవేంద్ర సర్కిల్‌లోని రాఘవేంద్ర స్వామి విగ్రహాలకు, దుర్గా మాత, గణపతి విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం గోరుకల్లు కృష్ణ స్వామి నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు మల్లికార్జున, జనార్ధన్ రెడ్డి, వికెసి.రాఘవేంద్ర, వడ్డే నారాయణ, శివకుమార్, మాధవరం రాజశేఖరరెడ్డి అనుచరులు వీరన్న స్వామి, గోపి, నరసింహులు, ఫరీద్, ఖాసీం, షేక్షావలీ, నరసన్న, ముత్తు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

'మున్సిపల్' ఉపాధ్యాయుల సమస్యలపై చొరవ చూపాలి

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ కోరారు. గురువారం ఆదోని మున్సిపల్ పాఠశాలకు వచ్చిన డిఇఒ శ్యామూల్ పాల్‌ను కలిసి వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడారు. ఇటీవల విడుదలైన సీనియారిటీ జాబితాలో గల అసంబద్ధాలను సవరించాలని కోరారు. వ్యక్తిగత అభ్యర్థనలను కార్యాలయంలో స్వీకరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జంగం బసవరాజు, బడుగు బసవరాజు, నూరుల్ హక్, చంద్రమౌళి, ఆనంద్, మద్దయ్య, దస్తగిరి, రాముడు, గఫార్, ఎల్లాగి, చంద్రశేఖర్ శర్మ, ప్రతాప్ రెడ్డి, భాస్కర్ ఆచారి, చంద్ర శేఖర్ ఉన్నారు.

మొదటి స్థానంలో నిలపాలి

- ఎల్ఐసి కార్యాలయంలో నూతన ఆర్థిక సంవత్సరానికి పూజ



పూజ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నూతన ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసి ఏజెంట్లు. డెవలప్‌మెంట్ ఆఫీసర్లు నూతన వ్యాపారాన్ని బాగా చేసి కడప డివిజన్‌లో మొదటి స్థానంలో నిలపాలని బ్రాంచి మేనేజర్ పుల్లి నాయక్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్ తెలిపారు. గురువారం ఎల్ఐసి ప్రాంతీయ కార్యాలయంలో 2025-26 నూతన ఆర్థిక సంవత్సరానికి గాను గణపతి, లక్ష్మీ పూజ నిర్వహించారు. కార్యాలయంలో బ్రాంచి మేనేజర్ పుల్లి నాయక్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మహేష్ కుమార్, సీనియర్ బిజినెస్ అడ్వయిజర్ పాటిల్ తిమ్మారెడ్డి కార్యాలయ సిబ్బందితో పట్టణానికి చెందిన పూజారి రఘునాథ స్వామి పూజా కార్యక్రమం నిర్వహించారు. పంచామృతాభిషేకం, వినాయక అష్టోత్తరం, లక్ష్మీ అష్టోత్తరం నిర్వహించారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న అనురాధ

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన

ప్రతి దరఖాస్తునూ పరిష్కరిస్తాం

- ఎన్నికల అధికారిణి అనురాధ

ప్రజాశక్తి - మంత్రాలయం

రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికల ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తునూ, ఫిర్యాదునూ పరిష్కరిస్తామని ఎన్నికల అధికారిణి అనురాధ తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను, ఫిర్యాదులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను, ఫిర్యాదులను పరిశీలించి కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు పరిష్కరించడానికి వచ్చినట్లు చెప్పారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి మొత్తం 129 దరఖాస్తులు వచ్చాయని, అన్ని దరఖాస్తులనూ పరిష్కరించినట్లు తెలిపారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 785 దరఖాస్తులు వచ్చాయని, అందులో 746 దరఖాస్తులను పరిష్కరించినట్లు చెప్పారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డిప్యూటీ కలెక్టర్ రమాతో తనకు మంచి స్నేహ సంబంధాలు కలిగి ఉండేవని, ఆమె మృతి బాధాకరమని తెలిపారు. రెవెన్యూ అధికారులు భీమన గౌడ్, ఆనంద్, సిబ్బంది ఉన్నారు.

వైస్ ఎంపిపి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదీతీరంలో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవాస్థానంలో నూతనంగా చేయించిన రథానికి కౌతాళం వైస్ ఎంపిపి బుజ్జి స్వామి (రామ లింగేశ్వర స్వామి) విరాళం అందజేశారు. గురువారం ఆయన మాట్లాడారు. ఈనెల 12న రథోత్సవాన్ని వివిధ పీఠాధిపతులు, ప్రముఖుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని రూ.20 వేలను విరాళం అందజేసినట్లు చెప్పారు.



విరాళం అందజేస్తున్న వైస్ ఎంపిపి